లిఫ్ట్ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

● మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

బెట్టెతండా లిఫ్ట్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

పాలకవీడు, మే 18: మండలంలో మూసీ, కృష్ణా నదులపై నిర్మిస్తున్న బెట్టెతండా, జాన్‌పహాడ్ లిఫ్ట్‌ల పనులను వేగవంతం చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మండలంలోని బెట్టెతండా, జాన్‌పహాడ్ గ్రామాల్లో జరుగుతున్న లిఫ్ట్ నిర్మాణ పనులను అధికారులతో కలిసి మంత్రి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెట్టెతండా గ్రామంలో మూసీ నదిపై రూ.33.83 కోట్లతో లిఫ్ట్ నిర్మాణం జరుగుతుందని, దీని ద్వారా బెట్టెతండా, పాడ్యతండా, సజ్జాపురం గ్రామాల్లో 2,041 ఎకరాలకు సాగు నీరు అందుతుందని చెప్పారు. 3 నెలల్లో లిఫ్ట్ పనులు పూర్తి చేసి ఆగస్ట్ నెల వరకు రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గుండెబోయినగూడెం గ్రామ శివారులో నిర్మిస్తున్న జాన్‌పహాడ్ లిఫ్ట్ పనులను పరిశీలించారు. రూ.173 కోట్లతో చేపడుతున్న జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ద్వారా 5,650 ఎకరాలకు సాగు నీరు అందుతుందని, తద్వారా పాలకవీడు మండల సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, నీటిపారుదల శాఖ అధికారి రమేశ్, డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, సీఐ చరమంద రాజు తదితరులు పాల్గొన్నారు.

వివాహ వేడుకలో మాజీ ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నూతన వధూవరులతో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

మోతె, మే 18: మండలంలోని గొల్లగూడెం గ్రామానికి చెందిన పెరుగు రమేశ్ కుమారుడి వివాహ వేడుక ఆదివారం జరుగగా.. కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు శీలం సైదులు యాదవ్, మాజీ సర్పంచ్ పెరుగు ఉపేందర్, బీఆర్ఎస్ నాయకుడు పెరుగు లింగయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'మార్కెట్ ధర ప్రకారం రైతులకు పరిహారం చెల్లించాలి'

మాట్లాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు

హుజూర్‌నగర్ రూరల్, మే 18: అగ్రికల్చర్ యూనివర్సిటీ నిర్మాణంతో భూములు కోల్పోయే రైతులకు మార్కెట్ ధర ప్రకారం నష్ట పరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని బూరుగడ్డ గ్రామంలో ఆ సంఘం నాయకులతో కలిసి ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బూరుగడ్డలో నిర్మించనున్న అగ్రికల్చర్ యూనివర్సిటీ కోసం పేదల ఆధీనంలో ఉన్న భూములను ప్రభుత్వం తీసుకుంటుందని, రైతులకు అన్యాయం జరుగకుండా పరిహారం చెల్లించాలని అన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పోసనబోయిన హుస్సేన్, మీగడ రాములు, ఆవుల సైదులు తదితరులు పాల్గొన్నారు.

'గోపా' బలోపేతానికి కృషి చేయాలి

సభ్యత్వాలు అందజేస్తున్న గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యం

సూర్యాపేట టౌన్, మే 18: గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా) బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సభ్యత్వ నమోదు విస్తృతంగా చేపట్టాలని గోపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీకూరి సత్యంగౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని గౌతమి కళాశాలలో ఆదివారం ఏర్పాటు చేసిన గౌపా జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాలు అందజేశారు. సమావేశంలో గోపా జిల్లా గౌరవాధ్యక్షుడు నాతి సవిందర్, ప్రధాన కార్యదర్శి ఎరగాని లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు నామాల గురుమూర్తి, కోశాధికారి అయితబోయిన రాంబాబు, జాయింట్ సెక్రటరీలు రాపర్తి మహేశ్‌కుమార్, భూపతి నారాయణ, అంతటి వెంకన్న, దోరెపల్లి రమేశ్, ఈసీ సభ్యులు కొత్త పుల్లయ్య, బూర సుధాకర్, భూపతి వెంకటయ్య, ఉయ్యాల సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృత్యువాత

నూతనకల్, మే 18: మండల పరిధిలోని యడవెల్లి గ్రామంలో ఆదివారం విద్యుదాఘాతంతో రెండు ఎద్దులు మృత్యువాత పడ్డాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. యడవెల్లి గ్రామానికి చెందిన రైతులు బయ్య గంగయ్య, ముత్తి లింగయ్యకు చెందిన ఎద్దులు మేత కోసం వెళ్లాయి. గ్రామ సమీపంలోని వ్యవసాయ భూమిలో మేత మేస్తూ ఇద్దరు రైతులకు చెందిన రెండు ఎద్దులు పొడుచుకుంటూ వెళ్లి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తగలడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందాయి.

పాఠశాలకు ప్రహరీ నిర్మాణం ఎప్పుడో ?

● చింతబండ ప్రాథమిక పాఠశాల తరగతి గదుల్లోకి ప్రవేశిస్తున్న విష పురుగులు

● అధికారులు, నాయకులకు విన్నవించినా మంజూరు కాని నిధులు

ప్రహరీ లేని చింతబండ ప్రాథమిక పాఠశాల

నేరేడుచర్ల, మే 18: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు భద్రతపై భరోసా కల్పించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే పలు చోట్ల పాఠశాలలు శిథిలావస్థలో ఉండగా మరికొన్ని పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని చింతబండ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో సిబ్బంది, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పాఠశాల పట్టణ శివారులోని పంట పొలాల మధ్యలో నిర్మించారు. దీనికి ప్రహరీ లేకపోవడంతో పాములు, తేళ్లు తదితర విష పురుగులు తరగతి గదిలోకి ప్రవేశిస్తుండడంతో విద్యార్థులు భయభ్రాంతులకు గురైన సంఘటనలు అనేకం ఉన్నాయి. అంతే కాకుండా పాఠశాల ఆవరణ మొత్తం వర్షాకాల సమయంలో బురదమయమై తరగతి గదుల్లోకి విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లలేని పరిస్థితి నెలకొంటుంది. ప్రహరీ లేక పాఠశాలకు రక్షణ కరువై రాత్రి సమయంలో పలువురు అసాంఘిక కార్యకలాపాలకు ఉపయోగించుకుంటున్నారు. ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది కోరుతున్నారు.

వాహనదారులు రోడ్డు నియమాలను పాటించాలి : ఎస్ఐ

మునగాల, మే 18: వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వాహనదారులు చేసే చిన్న చిన్న తప్పిదాల వలన జీవితాలు తలకిందులు అవుతాయని అన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని సూచించారు. హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపొద్దని వివరించారు. కారు నడిపే ప్రతి ఒక్కరూ సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, పోలీసులు అడిగినప్పుడు వాహనదారులు కచ్చితంగా వాహన ధ్రువీకరణ పత్రాలను చూపించాలని పేర్కొన్నారు.

'పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలి'

సమావేశంలో మాట్లాడుతున్న గిద్దె రాజేశ్

మునగాల, మే 18: రాష్ట్రంలో రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్లు కల్పించాలని జాతీయ వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని కలకోవ గ్రామంలో ఆదివారం ఏర్పాటు చేసి ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో దివ్యాంగులకు అనేక హామీలు ఇచ్చి వారి ఓట్లు వేయించుకొని గద్దెనెక్కిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలో ఉన్న 30 లక్షల మంది దివ్యాంగుల సమస్యలు కనిపించకపోవడం బాధాకరమని అన్నారు. తమిళనాడు రాష్ట్రంలో అమలు చేస్తున్న దివ్యాంగుల రిజర్వేషన్ తెలంగాణలో ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు. ఈ విషయమై మంత్రి సీతక్కను కలిసి విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మదన్‌మోహన్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఈదయ్య, శివకుమార్, మధు, శ్వేత, వెంకన్న, భద్రయ్య, నాగరాజు, గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

'వడ్డెరుల సమస్యలను పరిష్కరించాలి'

సభలో మాట్లాడుతున్న తెలంగాణ వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాలకృష్ణ

సూర్యాపేట టౌన్, మే 18: నిత్యం మట్టి, రాయి పని చేసే వడ్డెరులకు ఆ రాయి, మట్టిపై ప్రభుత్వం తగిన హక్కులను కల్పించాలని, వడ్డెరుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆలకుంట్ల బాలకృష్ణ కోరారు. జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన 'హలో వడ్డెర–చలో సూర్యాపేట' సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిత్యం మట్టి పని చేస్తూ క్వారీల్లో ఎంతో మంది వడ్డెరులు అమరులవుతున్నారని వారికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గుట్టలపై క్రషర్ మిల్లులను వడ్డెరులకు కేటాయించడంతో పాటు 1946కు ముందు వడ్డెరులు ఎస్టీ జాబితాలో ఉన్నందున తిరిగి ఎస్టీ జాబితాలో చేర్చాలన్నారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. వయసు పైబడిన వడ్డెర వృత్తిదారులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సీట్లు వడ్డెరులకు కేటాయించాలని కోరారు. సభలో వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓర్సు రాజు, గౌరవాధ్యక్షుడు ఓర్సు అంజయ్య, రూపని రాజు, పసుల సోమయ్య, గోగుల మహేశ్, వరికుప్పల నవీన్, శివరాత్రి గోపి, బండారు రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి సకాలంలో హాజరుకావాలి : తాసీల్దార్

నూతనకల్, మే 18: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు సకాలంలో హాజరుకావాలని తాసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి ప్రారంభమవుతుందని వెల్లడించారు. మండలానికి చెందిన ప్రజలు వారి సమస్యలపై లిఖిత పూర్వకంగా ఫిర్యాదును అందజేయాలని సూచించారు.

విద్యుత్ మోటార్ల దొంగలతో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్ఐ చలికంటి నరేశ్

గరిడేపల్లి, మే 18: వ్యవసాయ బావులు, పొలాల వద్ద విద్యుత్ మోటార్ల దొంగల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ చలికంటి నరేశ్ సూచించారు. పోలీస్ స్టేషన్‌లో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ మండలంలోని రైతులు వ్యవసాయ బావులు, పొలాల వద్ద ఉన్న మోటార్లను ఇంటికి తెచ్చుకొని భద్రపరుచుకోవాలని తెలిపారు. ఇటీవల మోటార్లు, కేబుల్ వైర్లు, ఇతర విలువైన సామగ్రి దొంగతనానికి గురవుతున్నాయని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమచారం ఇవ్వాలని తెలిపారు.

'అర్హులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలి'

మేళ్లచెర్వు, మే 18: అర్హులందరికీ రేషన్ కార్డులు మంజూరు చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సూరిశెట్టి బసవయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఆదివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందించాలని, అనర్హులను పక్కన పెట్టాలని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కొట్టె నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బతో వ్యక్తి మృతి

పెన్‌పహాడ్, మే 18: మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన షేక్ ముజీబ్ (38) అనే వ్యక్తి వడదెబ్బ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. ముజీర్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం సూర్యాపేటలో జరిగిన దివ్యాంగుల సమావేశానికి హాజరై తిరిగి ఇంటికి వచ్చిన ముజీర్ ఎండ తీవ్రత కారణంగా వడదెబ్బ తగిలి ఇంట్లో చికిత్స పొందాడు. పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం శనివారం రాత్రి 108 అంబులెన్స్‌లో సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు.

నిరుపయోగంగా ప్రయాణ ప్రాంగణం

మేళ్లచెర్వులోని మల్లారెడ్డిగూడెం రోడ్డులో నిరుపయోగంగా ఉన్న బస్టాండ్

మేళ్లచెర్వు, మే 18: మండల కేంద్రంలోని మల్లారెడ్డిగూడెం రోడ్డులో దాతల సహకారంతో సుమారు 20 ఏండ్ల క్రితం రూ.6 లక్షలతో ఏర్పాటు చేసిన బస్టాండ్ నిరుపయోగంగా మారింది. అధికారికంగా ప్రారంభానికి కూడా నోచుకోని ఈ బస్టాండ్‌లోకి బస్సులు నాలుగు రోజులు వచ్చిపోయాయి. ఆ తర్వాత ఇందులోకి బస్సులు రావడం మానేశాయి. దీంతో ప్రయాణికులు కూడా ఈ వంక చూడటం లేదు. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ప్రయాణికుల ప్రాంగణం ఆవరణలో ప్రస్తుతం కంప చెట్లు మొలిచాయి. ఇదే పరిస్థితి కొన్ని రోజులుంటే భవనం కూడా కూలిపోయే ప్రమాదం ఉంది. కాగా, బస్టాండ్ వినియోగంలో లేకపోవడంతో ప్రయాణికులు బస్సుల కోసం రోడ్లపై వేచి చూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నిరుపయోగంగాఉన్న బస్టాండ్‌కు మరమ్మతులు చేసి, ప్రహరీ నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. లేకపోతే విలువైన స్థలం వృథా అయి దాతల ఆశయం బూడిదలో పోసిన పన్నీరవుతుందని అంటున్నారు.

ఈ రోడ్డుపై నడిచేది ఎలా ?

శాంతినగర్ నుంచి పాత నేరేడుచర్లకు వెళ్లే రోడ్డుపై నిలిచిన మురుగు నీరు

నేరేడుచర్ల, మే 18: నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని శాంతినగర్ నుంచి పాత నేరేడుచర్లకు వెళ్లే రోడ్డుపైన పెద్ద గుంత ఏర్పడి మురుగు నీటితో నిండిపోయింది. దీంతో ఆ రోడ్డుపై సమీప ఇండ్ల ప్రజలు, ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు కనీసం నడిచి వెళ్లే పరిస్థితి కూడా కనిపించడం లేదు. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో మురుగు నీరు మొత్తం రోడ్డుపైకి వచ్చి అక్కడ పెద్ద గుంత ఏర్పడి నీరు మొత్తం నిలిచిపోతుంది. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లున్నా నిరుపయోగం

● మరమ్మతులకు నోచుకోని చేతిపంపు

● బాగు చేయాలని ప్రజల వేడుకోలు

దుబ్బగూడెంలో మరమ్మతులకు నోచుకొని చేతిపంపు

ఆత్మకూర్.ఎస్, మే 18: మండల కేంద్రం ఆత్మకూర్.ఎస్ ఆవాస గ్రామమైన దుబ్బగూడెంలో సుమారు 20 ఏండ్ల క్రితం చేతిపంపును ఏర్పాటు చేశారు. ఏడాది క్రితం వరకు అందులో నుంచి పుష్కలంగా నీళ్లు వచ్చేవి. నిత్యం ప్రజల దాహార్తిని, రోజువారీ అవసరాలను తీర్చిన చేతిపంపు ఏడాది క్రితం మరమ్మతులకు గురైంది. అప్పటి నుంచి దానిని బాగు చేయకుండా అలాగే వదిలేశారు. ప్రస్తుతం ఎండ కాలంలో దుబ్బగూడెం ప్రజలు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. అయినా చేతిపంపునకు అధికారులు మరమ్మతులు చేయడం లేదు. ఇప్పటికైనా అధికారులు మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చి నీటి సమస్యను తీర్చాలని కోరుకున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా చేతిపంపును పది రోజుల్లో బాగు చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామని పేర్కొన్నారు.

సీపీఐ గరిడేపల్లి మండల కార్యదర్శిగా అప్పయ్య

గరిడేపల్లి, మే 18: సీపీఐ గరిడేపల్లి మండల కార్యదర్శిగా కడియాల అప్పయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా సహాయ కార్యదర్శిగా పోటు పూర్ణచందర్‌రావును ఎన్నుకున్నట్లు వెల్లడించారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నాగారం: గురువులతో పసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

నాగారం, మే 18: మండల పరిధిలోని పసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996–97 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాటి గురువులు వెంకన్న, నారాయణ, పురుషోత్తం, నర్సిరెడ్డి, నీరజ, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

తుమ్మలపెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ఆత్మకూర్.ఎస్: మండల పరిధిలోని తుమ్మలపెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2004–05 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాలల్లో పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు వట్టికూటి సైదులు గౌడ్, వెంకన్న, నాగరాజు, లింగయ్య, శంకర్, మల్లయ్య, శేఖర్, కవిత, కల్పన, స్రవంతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

బేతవోలు స్కూల్ విద్యార్థులు

చిలుకూరు: మండల పరిధిలోని బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–2003 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒకరినొకరు పలకరించుకొని యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్య నేర్పిన గురువులను సన్మానించారు.

ఆత్మకూర్.ఎస్: తుమ్మలపెన్‌పహాడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

చిలుకూరు: ఆత్మీయ సమ్మేళనంలో బేతవోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

రాష్ట్రంలో ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు నిలిపివేయాలి

● మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్

సూర్యాపేట టౌన్, మే 18: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా తెలంగాణ హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వం కొంతకాలం ఉద్యోగ నియామక నోటిఫికేషన్లు నిలిపివేయాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు తలమల్ల హసేన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పు, గైడ్‌లైన్స్‌ను తెలంగాణ ప్రభుత్వం పూర్తిగా పరిశీలించకుండా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చేపట్టిన 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన వర్గీకరణ చేసిందని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకోకుండా దేశంలో తామే మొదటిసారిగా ఎస్సీ వర్గీకరణ చేశామని గొప్పలు చెప్పుకునేందుకు తొందరపడి రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణ చేసిందని విమర్శించారు. ఈ విషయమై మాలమహానాడు, షెడ్యూల్ కులాల హక్కుల ఫోరం తరపున తెలంగాణ హైకోర్టులో పిటిషన్ వేశామని, రెండు వాయిదాల తర్వాత కూడా రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని, కేసు పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఇటువంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం తొందరపడి ఉద్యోగాల నియామకం చేపట్టద్దని పేర్కొన్నారు.

భూసార పరీక్ష.. పంటలకు రక్ష

● రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

● పరీక్షల ఫలితాల ఆధారంగానే పంటల సాగు

● సారవంతమైతేనే అధిక దిగుబడులకు అవకాశం

కల్వల్‌దిన్న గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలాల్లో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం (ఫైల్)

నేరేడుచర్ల, మే 18: వ్యవసాయ భూములు ఆరోగ్యంగా ఉంటే నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చు. అందుకు రైతులు భూసార పరీక్షలు చేయించుకొని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులను ఆదా చేసుకోవచ్చు. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాలతో పాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందించి మొక్కలకు మరిన్ని పోషకాలు ఇవ్వగలిగితే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు నేలను కాపాడుకోవడానికి భూసార పరీక్షలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. సుస్థిర దిగుబడులు పొందడానికి రైతులు రెండేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయించుకుంటే ఎంతో మేలు. భూమిలో ఉండే పోషక పదార్థాలతో పాటు చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయి.

రెండేండ్లకు ఒకసారైనా

భూమిలో సారాన్ని తెలుసుకోవడానికి కనీసం రెండేళ్లకు ఒకసారైనా భూసార పరీక్షలు చేయించుకుంటే మంచిది. నేల సారవంతంగా ఉన్నప్పుడే ఆశించిన దిగుబడులు పొందవచ్చు. క్రమం తప్పకుండా భూసార పరీక్షలు చేయించుకోవడం వల్ల నేల స్వభావాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. భూమిలో ఏ ధాతువులు లోపించాయో భూసార పరీక్షల ద్వారా స్పష్టంగా తెలుస్తుంది. భూమిలో ఉండే పోషక పదార్థాలే కాకుండా చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యం వంటి వాటిని గుర్తించేందుకు భూసార పరీక్షలు అత్యంత ఆవశ్యకం. పరీక్షల అనంతరం నిపుణుల సూచన ప్రకారం పంటలు సాగు చేస్తే ఆశించిన నాణ్యమైన దిగుబడులు సాధించొచ్చు.

మట్టి సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- భూమిలో 15 సెంటీమీటర్ల వరకు గుంత తీసి పైపొర నుంచి కింది పొర వరకు మట్టిని సేకరించాలి.
- సేకరించిన మట్టిలో రాళ్లు, పంట వేర్లు, మొదళ్లు లేకుండా చూసుకుని నీడలో ఆరబెట్టాలి.
- మట్టి నమూనా సేకరణకు రసాయన, సేంద్రియ ఎరువుల సంచులను వినియోగించరాదు.
- ఎకరా విస్తీర్ణంలో 8 లేదా 10 చోట్ల సేకరించిన మట్టిని బాగా కలిపి నాలుగు విభాగాలు చేయాలి.
- పొలంలోని గట్ల వద్ద, పంట కాల్వల వద్ద ఉన్న మట్టిని పరీక్షల కోసం సేకరించకూడదు.
- చెట్ల కింద ఉన్న పొలం మట్టిని తీసుకోకూడదు.
- పశువుల పెంట, పచ్చిరొట్ట, కంపోస్టు వంటి ఎరువును కుప్పగా పోసిన చోట మట్టిని సేకరించకూడదు.
- ఎప్పుడూ నీరు నిలచే పల్లపు ప్రాంతాల మట్టిని తవ్వకూడదు.
- సేకరించిన మట్టిన నీడలో బాగా గాలికి ఆరబెట్టిన తర్వాత ప్లాస్టిక్ బ్యాగులో నింపి భూసార పరీక్ష కేంద్రానికి పంపించాలి.
- మట్టి నమూనాతో పాటు రైతు పేరు, సర్వే నంబర్, గ్రామం, మండలం, ఇంతకుముందు సాగు చేసిన పంట, ఇప్పుడు సాగు చేయబోయే పంటలు, ఫోన్ నంబర్ వంటి వివరాలను జత చేయాలి.

భూసార పరీక్షలతో రైతులకు మేలు

రైతులు భూసార పరీక్షలు చేయించుకోవడం ఎంతో మేలు. భూమి రకాన్ని బట్టి పంటలను సాగు చేసి తద్వారా నాణ్యమైన దిగుబడులను పొందడమే కాకుండా వృథా ఖర్చులను తగ్గించుకోవచ్చు. పంట పెట్టుబడిని తగ్గించుకోవడానికి భూసార పరీక్షలు ఉపయుక్తంగా ఉంటాయి. కనీసం రెండేళ్లకు ఒకసారి కచ్చితంగా భూసార పరీక్షలు చేయించుకోవాలి. దీని వల్ల నేలకు అనుకూలమైన పంటలు సాగు చేసుకోవడానికి వీలుంటుంది.

– జావిద్, ఏఓ, నేరేడుచర్ల